

# కథ

# ఎన్.ఆర్.ఐ పెళ్ళి కొడుకు

డా॥ ఎ. సీతారత్నం

అర్థగంటయి ఆలోచిస్తున్నా నా పేరునాకే గుర్తు రావడంలేదు. అమ్మో! మరో రెండ్రోజులయితే ఆలోచించినా గుర్తురాదేమో! ఎందుకంటే వచ్చిన దగ్గర నుండీ ఎన్.ఆర్.ఐ. పెళ్ళికొడుకని ఎన్.ఆర్.ఐ బావగారని, ఎన్.ఆర్.ఐ అల్లుడని అంటున్నారే తప్ప పేరుపెట్టి పిలిచినవారు లేరు. అమ్మా, నాన్న మా అబ్బాయి అంటున్నారే తప్పపేరు పెట్టి పిలవలేదు. వచ్చినస్నేహితులు ఇద్దరూ వెక్కిరింతగా ఎన్.ఆర్.ఐ పెళ్ళికొడుకనే అంటున్నారు. అసలు దీనికి కారణం నేనే. మొదటిరోజే ఎన్.ఆర్.ఐ.అన్నప్పుడే నాపేరు పెట్టి పిలవమనాలి. కానీ అంతరాంతరాల్లోఉన్న గొప్ప ఫీలింగ్ వలన వినీవిననట్టుగా ఊరుకొన్నాను. దాంతో అంతా నన్ను మెప్పించాలని ఎన్. ఆర్.ఐ. అనడం మొదలెట్టారు. ఆలోచన పూర్తవకుండానే మామగారొచ్చి ఒకభారీగా సినీ నటుడు ఎస్.వి. రంగారావు లాగా ఉన్న వ్యక్తిని చూపించి ' వీర్రాజు మావయ్య మా ఇంటికి పెద్ద దిక్కు' అని సుమారు 100 పెళ్ళిళ్లు దాటి చూసినవాడు' అని పరిచయం చేశారు. నమస్కారం పెట్టాను.

'నమస్కారం' అంటూ ఎన్.ఆర్.ఐ. అల్లుడ్ని బానే సంపాదించావు. ఎత్తుగా, బుట్టిగా బానే ఉన్నాడు. అవునూ, అమెరికాలో ఉద్యోగాలు పోతున్నాయట. మీకేం ఫరవాలేదా? మా మనవడి బామ్మర్ది బెంచెక్కా సాదులు. నీ కంపెనీ ఏంటీ?' అన్నాడు. అన్ని సంగతులూ తెలుసన్నట్టుగా.

అతని మాటల్లో నిజం తెలును కొందామనుకోవడం కన్నా ఈ సాధారణ అణాకానీ మేనల్లుడికి అంతమంచి ఎన్.ఆర్.ఐ. సంబంధమా? నీలాగ పొలం పుట్రా ఏవీలేవు. ఏదో గవర్నమెంటుద్యోగం. అనే భావనే ఎక్కువ కనబడుతోంది.

'చా, చా అదేంలేదు.అతను ఉత్తి బి.టెక్ కాదు.ఎమ్.ఎస్ చేశాడు. 5-6 సంవత్సరాలబట్టీ యు.ఎస్.లోనే ఉద్యోగం. అలాంటిదేం ఉండదు. రెండులక్షల పైనే జీతం. అలా ముఖం మీద అడగడమే. కుర్రాళ్ళు చాలా మారారు. మంచోడు కాబట్టి సరిపోయింది. మన రోజుల్లో అయితే నీ మాటకి అలిగి పెళ్లి కేన్సిల్ చేసుకొని వెళ్లిపోయేవారు. పద.... పద... అని లాక్కుపోయారు మావగారు.

అప్పుడే వంశీకృష్ణ వచ్చి 'నమస్కారం తాతగారూ ...' అన్నాడు.

మామగారు 'మా పెద్దల్లుడు' అని పరిచయం చెయ్యబోతే

'తెలుసు బేంక్ అల్లుడు.' ఏంవోయ్ ధాం... ధూం.... అని పెళ్లి చేస్తున్నావు. నీ పెళ్ళి కన్నా చాలా ఘనంగా చేస్తున్నాడు...

ఎన్.ఆర్.ఐ. అల్లుడు కదండీ"

'అబ్బబ్బ.... అతనికి పేరేంలేదా?'

'అరవింద్... ఎన్.ఆర్.ఐ. అంటే డబ్బుంటుందిగదా.... అందుకని వాళ్లస్తోమతలో చెయ్యాలనీ....' అన్నాడు వంశీకృష్ణ.

'డబ్బున్నది వాళ్ళకి కదా! మనం ఖర్చు పెట్టడం దేనికీ...."

"కానీ కట్నంలేదు. పెళ్ళిఘనంగా చెయ్యకపోతే ఏం బాగుంటుంది. పెద్దల్లుడు కొడుకుతో సమానం కాబట్టి కాస్త పనులు చూస్తున్నాడు. అన్నారు మామగారు.

కట్నం నేనూ తీసుకోలేదు. గొణుక్కొన్నాడు వంశీ కృష్ణ. కానీ ఎవరూ పట్టించుకోలేదు. ఎన్.ఆర్.ఐ. కట్నం తీసుకోకపోతే వార్త. బేంక్ ఉద్యోగి తీసుకోకపోయినా వార్తకాదు అనుకొన్నాడు. ఊరుకోలేక భార్య అంజలితో అన్నాడు. పోన్లెద్దూ, అతనితో పోలిక ఏంటి? మళ్లీ ఏ నాలుగేళ్లకో వస్తాడు. వదిలేయ్' అంది. కానీ ఆమెకీ కొంచెం మనస్సు చివుక్కుమంది భర్తముఖం చూస్తే. ఈ పెళ్లి ఖర్చుకి కూడా కొంత డబ్బు లోన్‌పెట్టి అతనే సర్దాడు. అందుకని-

"వీర్రాజుతాతా, ఉపమానాలు తగ్గించు. వాళ్ళని వీళ్ళనిపోల్చి వాళ్ళ పెళ్లి వీళ్లపెళ్లి అంటూ బేరీజు వెయ్యకు... ' అని గట్టిగానే చెప్పింది" పిల్లలు మరీ గడుగ్గాయలయిపోతున్నారు. మీ ఆయన్ని మేం ఏవీ అనలేదు. భోజనాలు చూపిస్తే వాటి గురించే మాట్లాడుకొంటాం' అన్నాడు వీర్రాజు.

'పద....' అని డైనింగ్ హాల్‌లోకి తీసుకు వచ్చింది ఏ.సి.హాల్ చాలా పెద్దది. పెళ్ళి తంతుకి ఒకటి. భోజనాలకి ఒకటి.

'గట్టిగానే పుచ్చుకొని వుంటాడే...'

"ఒక దానికి 25,000 రూ॥ రోజుకి... చెప్పింది అంజలి.

హాల్ చాలా పెద్దది. నాలుగు కౌంటర్‌లు ఏర్పాటు చేసారు. మధ్యలో ఫ్రూట్స్ పదిరకాలు... అందంగా కట్ చేసి అలంకరించినట్టే పెట్టారు. మరో చిన్న ఆకర్షణీయమైన కౌంటర్స్‌లో ఐస్ క్రీమ్. హాల్ అంతా కలయ చూసాడు వీర్రాజు.

భోజనానికి బేండ్ మేళంతో పిలుచుకు వచ్చారు మావాళ్లని అపుడే అయిదు రూములు చాలడంలేదని మరో రెండు ఏ.సి. రూమ్‌లు కావాలని చెప్పారు. ఆఘమేఘాలమీద ఏర్పాటు చేసాడు వంశీకృష్ణ.

మొదటి ప్లేటు నా చేతిలోనే పెట్టారు. మొదట కీర, కేరట్, టమాటా, ఉల్లి పాయముక్కలున్నాయి. తర్వాత స్వీట్స్ బొబ్బట్లు, బూరెలు, గులాబ్‌జామ్, రసమలై.... తర్వాత పెరుగ్గారె అరటికాయ పొడవు బజ్జీ, బిరియానీ, పులిహోర, బట్టర్‌నాన్ చెన్నాబట్టర్ పన్నీర్ మసాలా కూర, గుత్తొంకాయ కూర, బెండకాయ జీడిపప్పు ఫ్రై, మమిడి కాయ పప్పు, సాంబారు, మజ్జిగ పులుసు రసం, పెరుగు... తర్వాత నాలుగు రకాల పచ్చళ్ళు, గోంగూర, ఆవకాయ మిక్స్‌డ్ విజిటబుల్, నిమ్మకాయ, తర్వాత అప్పడాలు, మజ్జిగ మిరపకాయలు, సగ్గుబియ్యం అప్పడాలు ( రెండు రకాల ఆకారాల్లో...)

అబ్బో!.... చాలా ఉన్నాయనుకొంటూ ఈ నాజూకు పెళ్లికొడుకు ఏవైనా తినగలడా... అని వినీవిన్పించనట్టుగా అన్నాడు.

రెండు కీరముక్కలు, స్వీట్స్, పెరుగ్గారె... కొద్దిగా బిరియానీ వేయించుకొనే సరికి ప్లేటు చాలా బరువుగా అనిపించి వెనక్కి తిరిగాను. అంతా మొదలెట్టారు. వీర్రాజు మాత్రం నావల్ల కాదు. క్యూ కాయడం అన్నాడు.

'నీకు నేను తెస్తాను తాతయ్యా...' అంది అంజలి.

ఒక కుర్చీవేసి దానికి ఎదురుగా ఇంకో కుర్చీపెట్టి వడ్డించిన ప్లేటు పెట్టింది అంజలి. 'తాతయ్యా, కావలసినవి అడుగు...' అంది.

తింటున్న వాళ్లలో ఒకతను నవ్వుతూ 'ఇప్పుడు మంతెన సత్య నారాయణ రాజు వస్తే.. ఈ భోజనానికి గుండె బాదేసుకుంటాడేమో' అన్నాడు. 'హాయిగా తిందామనుకొంటుంటే ఆయన్ని ఎందుకురా తలచుకొంటావు. బొబ్బట్టు వేసుకో.. అన్నారు మరొకరు.

'స్వీటా, నాకా, నేనా డయాబెటిక్. మా ఆవిడపక్కనే ఉంది. ఊరుకోదు. వద్దులే' అన్నాడు.

'డయాబెటిక్ లేనిది ఎవరికి. సగం మందికి ఉందిదేశంలో. అంత బిగదీసుకోనక్కరలేదు. పెళ్ళిళ్ళ అప్పుడేగా. ఇంట్లో ఎలాగూ పథ్యమే ' అన్నారు మరొకరు.

'అబ్బే, కొద్దిగా కఠినంగా ఉండాలి. ఈ దేశంలో పెళ్ళిళ్లకి వెళ్ళడంతోనే సగం జీవితం అయిపోతుంది.'

'ఇతర దేశాల్లోలాగా తాగుళ్లకి వెళ్లడంకన్నా నయమే అన్నాడు కొంచెం సీరియస్‌గా మరొకతను. కొద్దిగా ఆశ్చర్యపోయి నిశ్శబ్దంగా ఊరుకొన్నారు.

'కొందరు తినకూడదను కొంటూనే తింటున్నారు.

'కొందరు అలక్ష్యంగా తింటున్నారు.

ఆడవాళ్లయితే మరీ బాధగా తింటున్నారు. ఒకామెలావుగా ఉన్నాకదా! నేనే తినడానికి అర్హురాల్ని కాదన్పిస్తుంది. తెలుసా' అంది దిగులుగా.

'నయం. ముందొచ్చాం. చూడు, ఒక్కసారి ఎంత రష్ అయిపోయిందే' అంది మరొకామె. అటు పక్క చూశారు. క్యూ చాలా పెద్దగా కిక్కిరిసినట్టుగా జనం ప్లేటు పట్టుకుని ఎప్పటికి తనదాకా వస్తుందన్నట్టు - ప్లేటు పట్టుకోలేని చిన్నపిల్లలు. బరువుగా పట్టుకొన్న పెద్దలు. ఆ క్యూలో ఒకామె 'ఇంకోస్వీట్ వేసుకో' అని కొడుకుని గద్దించింది. తినలేనేమో...' అన్నాడు. నీకు మళ్ళీకావాలంటే ఈ పద్మవ్యూహంలోకి దూరి నేను తేలేను. పారేస్తే పారేయ్. నెమ్మది అని మరొకటి వేయించింది. అక్కడ అందరి పరిస్థితి అలాగే ఉంది. మళ్లీ రాలేమని అంతా ప్లేటునిండా వేసుకొని మొయ్యలేక కుర్చీల కోసం వెతుక్కుంటున్నారు.

కొందరి ముఖంలో అపరాధభావం ' ఈ వారంలో మూడు పెళ్లిళ్లు. చచ్చేలా చేసిన డైట్ అంతా గోవిందా ' అని విసుక్కొంటూ తింటోంది మరొకామె.

'నిజమే, ఎంత వద్దనుకొన్నా టెంప్ట్ అయిపో తున్నాం.. అంది మరొకామె.

'పిల్లలు ఎంత వేగంగా వేయించుకొన్నారో అంతవేగం ప్లేటు నిండగానే ముఖం మొత్తికింద పెట్టేసారు. ఒక్కగంటకే ఆకలి అంటావు తిను అనితల్లులు బ్రతిమలాడుతున్నా వినడంలేదు. ఐస్ క్రీమువైపు పరుగులు పెట్టారు కొందరు. గులాబ్ జామ్, ఐస్ క్రీముకలిపి తింటున్నారు కొందరు. అలాంటి పిల్లల్ని ఇప్పటికీ బొండాంలాగున్నావు. ఇంకా చాలా లావయి పోతావు. అలా ఆబగా తినకు' అంటే ఆ పిల్లలు కళ్లనిండా నీళ్లతో కోపంగా చూస్తున్నారు.

మొత్తానికి ఎవరూ తృప్తిగా, ఆనందంగా తినడం లేదు. వీర్రాజు ఒక్కడే కాస్త ఆనందంగా రుచులు ఆస్వాదిస్తున్నాడు. అపుడే దగ్గరికి వచ్చి 'ఏం తెమ్మంటావు?' అంది. ముందు ఈ దండగ గులాబీని పట్టుకో. చెయ్యి తిమ్మిరెక్కేసింది. పారేయలేక పట్టుకొన్నా... అన్నాడు. అది తీసుకొంటూ.

'రిసెప్షన్‌లో ఇచ్చిందా. దండగ గులాబీ అంటావేంటే? కాస్త సౌందర్య దృష్టి ఉండాలి.' అంది.



హైదరాబాద్ మానస ఆర్ట్స్ నిర్వహించిన సభలో నాయని సుబ్బారావు స్మారక పురస్కారాన్ని డా॥ ద్వా.నా. శాస్త్రికి అందజేస్తున్న ఆచార్య నాయని కృష్ణకుమారి, ఆచార్య ఎ. భూమయ్య, చిత్రంలో పోతుకూరి సాంబశివరావు, జె. బాపురెడ్డి, కళా దీక్షితులు, చేరా, రఘుశ్రీలను చూడవచ్చు.

'ఆమె చూడు. ఎంత సుందరంగా ఉందో? ఎక్కడ బడితే అక్కడ గులాబీలే. కుర్చీల్లో, ప్లేటుల కింద... కాళ్లకింద... తన కాళ్లకిందే తొడిమకి ఒకే రేకు మిగిలి దీనంగా చూస్తున్న గులాబీ. పుష్ప విలాపం గుర్తొచ్చింది. ఒక్కసారి విచారంగా అన్పించింది.

అపుడే వంశీకృష్ణ వచ్చి "భోజనం ఎలా ఉందన్నాడు?" "జిహ్వా కావాలంటుంది. పొట్ట వద్దంటుంది...' 'ఎందుకయ్యా ఇన్ని ఐటమ్స్ ఏదో పప్పు, కూర. పులిహోర, బూర్లు..అనుకో తృప్తిగా తినేవాళ్లం. ఆశ ఎక్కువ.. పీక సన్నం..

చూదు.. ఎన్ని దండగో.. ప్లేటు ఎంతేంటి?

"425 రూ॥ ... 'బాబోయ్' అన్నాడు.

కింద పెట్టిన ప్రతి ప్లేటులో చాలా పదార్థాలు.. ఎంత వృథాయో అని అనుకోకుండా ఉండలేకపోయారు.

నాకు కూడా అసలు ఇన్ని ఐటమ్స్ కావాలని ఇంత గ్రాండ్‌గా చేయాలని అనవసరంగా అన్నాను అని చాలా బాధన్పించింది.

అంతా ఎవరి సందడిలో వారున్నారు. నాకు మాత్రం చాలా విచారంగా ఉంది. "పరబ్రహ్మం కోడలు విడాకులిచ్చేసింది. ఇంతకన్నా ధాం.. ధూం.. అన్పించి పెళ్లి చేసారు. భరణం గట్టిగానే పుచ్చుకొన్నాడు. ఆరునెలలు కూడా కాపురం చెయ్యలేదు.. అని ఎవరికో చెబుతున్న పక్కతని మాటలు చెవిలో పడ్డాయి.

ఆక్షణంలోనే వీర్రాజు తాత మూతగానున్న పళ్లెం ఒకటి తీసి గరిటతో గణగణలాడించాడు. ఏంటా అని అంతా అటు చూసారు.

'గోవిందా ...గోవిందా... అనండి. ఒకపద్యం చదవండి. అందరి భోజనాలు అయినట్టేనా.. అన్నాడు.

'అలా అవడం ఉండదులే. పంక్తి భోజనాలు కావుగా' అంది కొంచెం విసుగ్గా అంజలి.

చాలామంది తెలుగుని డోంట్ నో అన్నారు. కొంత మంది వచ్చినా అదిచాలా పాత పద్ధతి- ఫేషన్ కాదనుకొని నోరెత్తలేదు. వీర్రాజే పద్యం 'కందుకము వోలెనుజనుండు... అంటూ అందుకొన్నాడు. అంతా చప్పట్లు కొట్టారు. పళ్లెం తీసుకొని పిల్లలు గణగణ లాడిస్తూ వన్స్‌మోర్ అన్నారు. మళ్లీ చదివారు.

'చాలా బాగుంది. వెరీ ఇన్‌స్పైరింగ్ పోయమ్' అన్నాను గభాల్న.

'భర్తృహరిది వచ్చిన ఉత్సాహాన్ని తిరిగి తెస్తుంది. నువ్వు నేర్చుకో ' అన్నాడు.

'తప్పకుండా...' అన్నాను నేను.

× × ×

డైనింగ్ హాల్ బయటికి వచ్చి 'వంశీకృష్ణ' కావాలని అడిగాడు. చుట్టు పక్కలంతా వెదకి పదిమంది వరసగా కాల్ చేస్తే ముండేసి మెట్లు దిగుతూ రొప్పుతూ ...గంగా వచ్చాడు కంగారుగా.

'పెళ్లి కొడుకు నీగురించి అడిగాడు. ఎక్కడికెళ్లావు..

'డాబామీదకి. పాప ఏడుస్తోందని అంటూనే సారీ సర్ ఏంకావాలి?' అని అడిగాడు.

'సర్ ఏంటండీ నా పేరు అరవింద్ అలా పిలవండి' అన్నాను.

చిరునవ్వు వచ్చింది వంశీకృష్ణ ముఖంలోకి. అప్పటిదాకా లేని ఆప్యాయత కన్పించింది కళ్లల్లో.

'వినీలతో అర్జెంటుగా మాట్లాడాలి

'మీరే కాల్ చెయ్యకపోయారా...

'ఇపుడు బాగుండదేమోనని...

ఏం ఫరవాలే.. ఈ రూమ్‌లో కూర్చోండి. పిలుస్తా అన్నాడు

× × ×

వినీల 'ఇంగ్లీష్ బాగా వచ్చిందా' అని అడుగుతాడా ఏదైనా లవ్ ఫ్లాష్‌బాక్ సినిమాల్లో లాగ చెప్తాడా అని అనుకొంటూ వచ్చింది. తనుకొన్న 30,000 రూ॥ పట్టుచీర బరువుగా మోసుకొస్తూ పెట్టుకొన్న ఆభరణాలతో మిలమిలా మెరుస్తూ దగ్గరగా వచ్చి 'ఏంటన్నట్టు'గ కనుబొమ్మ లెగరేసింది.

క్షమించాలి ముఖ్య విషయం. నాకు ప్రస్తుతం యు.ఎస్.లో ఉద్యోగం పోయింది. అక్కడ లోన్స్ అవీ క్లియర్ చేసాక... ఇల్లు ఖాళీ చేసి మొత్తం మీద మిగిలినవి 1.8 లక్షలు మాత్రమే. ఇవి ఖర్చయ్యే లోపల మరొకటి సంపాదించుకోగలను. ప్రస్తుతం వెళ్లే అవకాశంలేదు. హనీమూన్ మూడ్ కూడా లేదు. ముందే మీకు చెప్తే కేన్సిల్ చేసుకోవచ్చు. తర్వాత విడాకులు ... ఇవన్నీ కష్టం'

ఇంత ఖర్చు పెట్టేక... అంది గట్టిగా.

50% నేను ఇస్తాను. కాదు మొత్తం ఇచ్చేస్తా. కాస్తటైమ్ ఇస్తే. నిజానికి నేను చాలా ఉద్యోగాలు మారాను. మారినపుడు, పోయినపుడు కూడా ఎవరికి చెప్పలేదు. వీకెండ్ కల్చర్. సాటర్‌డే, సన్‌డే... విపరీతంగా తిరగడం, టూరిజమ్ చదువుకి చేసిన లోన్స్ తీర్చడం ఇండియా వచ్చినపుడు ఖరీదయిన గిఫ్ట్స్ తేవడం... గొప్పకోసం ఖర్చులు మొత్తానికి పొదుపు కాన్సెప్ట్ తెలీదు. ఇపుడు అంతా దండగ ఖర్చు అన్పిస్తోంది. నువ్వుమనం మొదట కలిసినపుడు 'టూర్స్ ఇష్టమా' అని అడిగితే-

' ఎప్పుడైనా వెళ్లొచ్చు. అంతేగానీ ఆదివారం అవగానే తాళం వేసి వెళ్లిపోవడం కన్నా మన ఇంటికి వచ్చేవాళ్లతో సరదాగా కలిసి ఒక కప్పుటీ త్రాగి ప్రశాంతంగా ఉండటమే నా కిష్టం. అన్నావు. టాక్స్‌సిస్సియర్‌గా కట్టిన తర్వాత కనీసం 10% ఖచ్చితంగా ఇతరుల అవసరాలకు ఖర్చు పెట్టాలను కొంటానన్నావు.

'ఇప్పుడవన్నీ ఎందుకు'

అవి మంచి ఆలోచనలు.నిజానికి నువ్వంటే నాకు చాలా ఇష్టం కానీ నేను ప్రస్తుతం ఎన్.ఆర్.ఐ.ని కాదు. నన్ను పెళ్లిచేసుకొంటావాలేదా... అని'

అపుడే ఇద్దరు పిల్లలు ఆరేడు సంవత్సరాల వాళ్లు తలుపు తోసుకొని లోపలికి వచ్చారు.

'అక్కా పెన్సిల్ అను ' అన్నాడు బాబు.

'ఊహూ.. అంది తల అడ్డంగా ఊపి వినీల.

'మీరుంటారా అడిగారు నన్ను.

'ఊ.. అని అనబోతే గబుక్కున చేత్తో అతని నోరుమూసింది వినీల.

అయోమయంగా అన్పించినా ఆ స్పర్శ అపురూపంగా అన్పించింది.

పాప 'పెన్సిల్' అంది గభాల్న.

నీ పెళ్లి కేన్సిల్' అన్నాడు బాబు. చప్పట్లు కొడుతూ బయటికి వెళ్లిపోయారు.

పిల్లలు కదా. అదో సరదా ....అంటూ చెయ్యి తీసింది.

'అందుకేనా నా నోరు మూసింది.అంటే మన పెళ్లి అవుతుందన్న మాట. కేన్సిల్ అవదు. మీ ఫాదర్‌కి చెప్పు. ఎన్.ఆర్.ఐ.ని కాదని.

ఊ....అని నవ్వుతూ తలలో మల్లెల పరిమళాన్ని గదిలో వదిలి వెళ్ళిపోయింది.

